JAYABHERIDAILY.COM

ప్రభాత
# జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 07-05-2026

Medchal - Malkajgiri । Thursday 07-05-2026

Follow: jayabherinews

సంపుటి : 02 । సంచిక : 340

పేజీలు : 8 । వెల : 5

Vol. 02 । Issue 340 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889

call me

jayabheripaper@gmail.com





# మెట్రో ఫేజ్ 2కి అనుమతులు ఇవ్వాలి

- మెట్రో రైలు ఫేజ్ -2, ఫేజ్ -3 విస్తరణ

**జయభేరి, న్యూఢిల్లీ:**

హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2కు ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ కి విజ్ఞప్తి చేశారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్ 2 సమగ్ర ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని తెలిపారు. ముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2, మెట్రో ఫేజ్ 3 పై చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ 2, ఫేజ్ 3 విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రో ఫేజ్Iను L&TMRHL ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని వివరించారు. ప్రస్తుతం ఫేజ్ I ప్రభుత్వం పరిధిలో ఉండడంతో ఫేజ్ 2, ఫేజ్ 3 విస్తరణ సులుభమవుతుందని చెప్పారు. మెట్రో రైలు నెట్‌వర్క్‌ను

...మిగతాది 2 లో

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం తెలపాలని కేంద్ర పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ను ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశాను. మెట్రో ఫేజ్-2 డీపీఆర్‌ను ఇప్పటికే కేంద్రానికి సమర్పించిన విషయాన్ని గుర్తు చేశాను. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-II, ఫేజ్-III విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రో ఫేజ్-Iను L&TMRHLను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి చెప్పాను. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-II ప్రాజెక్ట్ ను భారత ప్రభుత్వం – తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కోరాను. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా RGIఎయిర్‌పోర్ట్ – భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-IIIగా చేపట్టాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించాను. మెట్రో ఫేజ్-III కి సంబంధించిన డీపీఆర్ ను కూడా ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి గుర్తు చేశాను.

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# రైతుల కష్టాల పట్టడం లేదు



- అది నిరూపిస్తే రాజీనామా చేస్తా..
- నా సవాల్ స్వీకరించాలి..
- 'రైతు సంగ్రామ సదస్సు'లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు

**జయభేరి, వరంగల్, మే 6 :**

వరంగల్ వేదికగా జరిగిన 'రైతు సంగ్రామ సదస్సు'లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. వరంగల్ జిల్లా కాకతీయ పౌరుషాల గడ్డ అని కొనియాడిన కేటీఆర్, ఇక్కడి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని ప్రకటించారు. నాలుగేళ్ల క్రితం వరంగల్‌లో కాంగ్రెస్ ప్రకటించిన 'రైతు డిక్లరేషన్' ఒక నయవంచన అని, అది కేవలం ఓట్ల కోసమే చేసిన 'కొంగజపం' అని ఆయన మండిపడ్డారు. డిక్లరేషన్‌లో ఇచ్చిన 34 హామీలను గాలికొదిలేశారని, వంద రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా అతీగతీ లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓట్లు వేసిన రైతులు నేడు అరిగోస పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్‌ను ఒక బోగస్ చిత్తు కాగితంగా అభివర్ణించిన కేటీఆర్... ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు మేళాలను 'దగా మేళాలు'గా సంబోధించారు. కేసీఆర్ హయాంలో ఎకరాకు రూ. 10 వేలు అందిస్తే, రూ. 15 వేలు ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్.. నేడు కనీసం ఉన్న సౌకర్యాలను కూడా అందించలేకపోతోందని

...మిగతాది 2 లో



# వసాయ రంగానికి రూ.2.55 లక్షల కోట్లు

- ఎంఎస్‌ఎంఈలకు రూ.1.64 లక్షల కోట్లు
- రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యాన పంటల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.5,313 కోట్లు

**జయభేరి, విజయవాడ, మే 6 :**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాధాన్యతా రంగాలకు రుణ పరపతిని పెంచే లక్ష్యంతో 2026, 27 ఆర్థిక సంవత్సరానికి గాను నాబార్డు రూపొందించిన రుణ ప్రణాళికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిన్న జరిగిన ఈ కార్యక్రమంలో రూ.5,11,491 కోట్లతో కూడిన 'స్టేట్ ఫోకస్ పేపర్'ను ఆయన విడుదల చేశారు. గతేడాది (2025, 26) ప్రణాళిక అయిన రూ.4.24 లక్షల కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 20 శాతం అధికం కావడం గమనార్హం. ఈ రుణ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ రూ.2.55 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో పంట రుణాల కోసం రూ.1.66 లక్షల కోట్లు కేటాయించారు. అదేవిధంగా, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో కీలకమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ)కు రూ.1.64 లక్షల కోట్లు కేటాయించడం జరిగింది. పశుసంవర్ధక శాఖకు రూ.34,972 కోట్లు, మత్స్య రంగానికి రూ.21,098 కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. హార్టికల్చర్‌ను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి బ్యాంకులు, నాబార్డు అధికారులు పూర్తి మద్దతు అందించాలని పిలుపునిచ్చారు. ఏటా 450 లక్షల మెట్రిక్ టన్నుల హార్టికల్చర్ ఉత్పత్తులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యాన పంటల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.5,313 కోట్లు కేటాయించడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు సీజీఎం ఎం.ఆర్. గోపాల్, జీఎం కే.వి.ఎస్. ప్రసాద్‌తో పాటు ఎస్ఎల్‌బీసీ, ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్, ఏపీ గ్రామీణ బ్యాంక్, ఆప్కాబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాష్ట్రాల్లో పెరగనున్న రైల్వే నెట్ వర్క్



- ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సుమారు రూ. 23,437 కోట్ల మొత్తం వ్యయంతో కూడిన 03 ప్రాజెక్టులకు నాడు ఆమోదం

**జయభేరి, న్యూఢిల్లీ, మే 6 :**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని 19 జిల్లాల మీదుగా సుమారు 901 కిలోమీటర్ల మేర భారత రైల్వే నెట్‌వర్క్‌ను పెంచుతూ, మూడు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ. 23,437 కోట్లు కాగా, ఇవి 2030 31 నాటికి పూర్తి కానున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన సుమారు రూ. 23,437 కోట్ల మొత్తం వ్యయంతో కూడిన 03 (మూడు) ప్రాజెక్టులకు నాడు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల వివరాలు ఇవే.

ఎ) నాగ్దా - మధుర 3వ, 4వ లైన్

బి) గుంతకల్ - వాడి 3వ, 4వ లైన్

సి) బుర్వాల్ - సీతాపూర్ 3వ, 4వ లైన్

పెరిగిన లైన్ సామర్థ్యం రైళ్ల రాకపోకలను గణనీయంగా పెంచుతుంది. తద్వారా భారత రైల్వే నిర్వహణ సామర్థ్యం, ప్రయాణికులకు సేవలు పెరుగుతాయి. ఈ మల్టీట్రాకింగ్ ప్రతిపాదనలు రైళ్ల కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, రద్దీని తగ్గించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు ప్రధాని నరేంద్ర మోదీ నవ

...మిగతాది 2 లో



# వస్తావా.. నీ రేటెంత..?

- హైదరాబాద్ లో ఆకతాయిల బారినపడ్డ లేడీ ఐపీఎస్
- వివాదంగా లేడీ సింగం నైట్ స్టోరీ

**జయభేరి, హైదరాబాద్, మే 6 :**

హైదరాబాద్ నగరంలో రాత్రి 11 గంటలు దాటితే చాలు ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బస్టాండ్ ల వద్ద, మెట్రో స్టేషన్ల వద్ద ఒంటరిగా అమ్మాయి కనిపిస్తే చాలు, గద్దల్లా వాలిపోతారు. బైక్స్ పై అమ్మాయి సమీపంలో రౌండ్లు కొడుతూ, కొద్ది సేపు గమనించి, వెంటనే దగ్గరకు వచ్చేస్తారు. వస్తావా మాతో, నీ రేటెంత అంటూ ప్రశ్నల వర్షం కురిపించి వేధింపులకు పాల్పడుతుంటారు. నెమ్మదిగా బేరాలు మొదలెడతారు. ఇలా నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల వద్ద ఇదే తంతు. తాజాగా ఇలాంటి ఆకతాయిలపై దృష్టిపెట్టి, వార్తల్లో నిలిచారు లేడీ సింగం, మల్కాజ్ గిరి నూతన పోలీస్ కమిషనర్ సుమతిమల్కాజిగిరి సీపీగా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజే, టార్గెట్ ఆకతాయిలు అంటూ రంగంలోకి దిగారు. అర్ధరాత్రి 12 గంటలకు దిల్‌సుఖ్ నగర్ బస్టాండ్ వద్దకు సివిల్ డ్రస్ చేరుకున్న పోలీస్ కమిషనర్ సమతి. రోడ్డుప్రక్కన సాధారణ మహిళలా నిల్చున్నారు. అటుగా వెళుతున్న ఆగతాయిలు,

...మిగతాది 2 లో



# తెలంగాణలో నామినేటెడ్ పదవుల భర్తీ!

**జయభేరి, హైదరాబాద్, మే 6 :**

తెలంగాణలో అధికారం చేపట్టిన నాటి నుండి పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. ఎన్నాళ్లగానో ఆశావహులు ఎదురుచూస్తున్న ఈ పదవులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోక్షం కల్పించింది. రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నియామకాలకు సంబంధించిన వివరాలను టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అధికారికంగా ప్రకటించారు. పార్టీ కోసం కష్టపడిన నేతలకు, సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేస్తూ ఈ పదవుల పంపకం జరిగినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన జాబితాలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా వెనుకబడిన తరగతులు (BC), అగ్రవర్ణాలలోని వివిధ సామాజిక వర్గాల కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించడం ద్వారా క్షేత్రస్థాయిలో రాజకీయ బలాన్ని

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## రైతుల కష్టాల పట్టడం లేదు

విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికి 69 సార్లు ఢిల్లీకి వెళ్లారని, కానీ రాష్ట్ర రైతు ప్రయోజనాల కోసం ఒక్క పైసా కూడా తీసుకురాలేదని ఆక్షేపించారు. రైతుల సహనాన్ని పరీక్షించవద్దని, వడ్ల కొనుగోళ్లలో జాప్యం జరిగితే కాంగ్రెస్ నేతలను గ్రామాల్లో రైతులు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

**అది నిరూపిస్తే రాజీనామా చేస్తా..**

సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు. బుధవారం వరంగల్ జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

**నా సవాల్ స్వీకరించాలి..**

ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ సెటైర్లు గుప్పించారు. కాంగ్రెస్ నేతలకు రైతన్నల ప్రతాపం చూపించే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యూవల్ సీఎం అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఒక్క ఊరిలోనైనా సంపూర్ణంగా చేసిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఈ సవాల్‌ను రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు స్వీకరిస్తారో లేదో చెప్పాలని అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతరలో రూ.70 కోట్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను దండుపాళ్యం బ్యాచ్‌లా రేవంత్‌రెడ్డి అండ్ కో దోచుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఇన్నాళ్లూ చేసినవి తప్పుడు ఆరోపణలని తేలిపోయిందని.. ఇకపై ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. మేడిగడ్డను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి పేల్చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. కానీ యూరియా బస్తాలు ఇచ్చేది మాత్రం తెలియదని కేటీఆర్ విమర్శించారు.

## వస్తావా.. నీ రేటెంత..?

ఆమెను గమనించడం మొదలు పెట్టారు. అలా కొద్దిసేపటికే ఒక్కొక్కరుగా ఆమె చుట్టూ చేరుకున్నారు. హలో వస్తావా.. నీ రేటెంత .. అంటూ అడగటం మొదలుపెట్టారు.అలా అర్ధరాత్రి 12 గంటల నుండి తెల్లవారుజామున 3.30 గంటల వరకూ సుమారు మూడున్నర గంటలపాటు లేడీ ఐపీఎస్‌ను కొందరు పోకిరీలు తమ మాటలతో వేధించారు. రోడ్డుపై నడుకుంటూ వెళుతున్న ఆమెను బైక్ లతో అడ్డుపడుతూ, ఈ రాత్రికి వస్తావా.. అంటూ బేరాలు మొదలెట్టారు. అలా ఆకతాయిల వేధింపులు భరిస్తూ , అక్కడున్న పరిస్థితులను స్వయంగా గమనిస్తూ రోడ్డుపక్కన గంటలపాటు నిల్చుని రాత్రివేళల్లో మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో స్వయంగా పరిశీలించారు మల్కాజిగిరి సీపీ సుమతి. మూడున్నర గంటలుగా అటువైపు ఏ ఒక్క పోలీసు కానిస్టేబుల్ రాలేదు. కనీసం పెట్రోలింగ్ వాహనం సైతం అటువైపు రాకపోవడంతో ఆకతాయిలు ఇంకా రెచ్చిపోయారు. బైక్ లపై చక్కర్లు కొడుతూ, ఒంటరి మహిళను వేధించడం ఆపలేదు. తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో ఓ కానిస్టేబుల్ అటుగా వచ్చి, కమిషనర్ వద్ద నిల్చున్నారు. మరికొద్దిసేపటికే ఓ ఎస్సై వచ్చి మఫ్టీలో ఉన్న ఐపీఎస్ అధికారి సుమతికి సెల్యూట్ కొట్టారు. పోలీస్ ఆ మహిళకు సెల్యూట్ కొట్టడంతో అక్కడున్న ఆకతాయిలకు ఒక్కసారిగా గుండె ఆగినంత పనైంది. అసలు ఏం జరుగుతుందో వారికి అర్థం కాలేదు. ఆమె ఒంటరి మహిళకాదు. వాళ్లు అనుకున్నట్లు సాధారణ మహిళ అంతకన్నాకాదు. ఆమె సివిల్ డ్రస్ లో ఉన్న ఐపీఎస్ అధికారిణి మల్కాజ్ గిరి పోలీస్ కమిషనర్ అని తెలుసుకున్న పోకిరీలకు గుండె ఆగినంత పనైంది. ఇంకేముంది క్షణాల్లో పెట్రోలింగ్ వెహికల్ స్పాట్ కు రావడం, ఆమెను వేధించిన 40మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించడం చకచకా జరిగిపోయాయి. మరో పోలీసు వాహనంలో స్టేషన్ కు చేరుకున్న ఐపీఎస్ సుమతి , పోకిరీలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇంకోసారి రోడ్లపై ఒంటరి అమ్మాయిలను టార్గెట్ చేస్తే తాట తీస్తానంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇలా పోలీసులకు చిక్కిన 40 మందిలో విద్యార్థులు, ఉద్యోగులతో పాటు గంజాయి సేవించిన బ్యాచ్ కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇలా సాహోసోపేతమైన ఆపరేషన్లు చేయడం సుమతికి ఇప్పుడేం కొత్తకాదు. సరిగ్గా 25ఏళ్ల కిందట 2001లో డీఎస్పీగా ఛార్జ్ తీసుకున్న వెంటనే కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద ఒంటరిగా మఫ్టీలో వెళ్లి నిల్చుని, వేధించడానికి వచ్చిన ఆకతాయిల భరతం పట్టారు. వివాదంగా మారుతున్న ఐపీఎస్ ఆపరేషన్..ఇలా తెలుగు రాష్ట్రాల్లో లేడీ సింగం, ఐపీఎస్ అధికారిణి సుమతి ధైర్య సహసాలకు సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆఫీసర్ అంటే ఇలా ఉండాలి.. హ్యాట్సాఫ్ మేడం అంటూ పొగడ్తలతో కామెంట్స్ , పోస్టులు పెడుతూ మల్కాజ్ గిరి కమిషనర్ చర్యలను మెచ్చుకున్నారు. అయితే ఇదే క్రమంలో ఆమెపై విమర్శలు, కౌంటర్లు కూడా అంతే స్థాయిలో వస్తున్నాయి. ఇవి కాదు మేడం , రాజకీయాల్లో అవినీతి చేసే నేతలను, తప్పులు చేసి తప్పించుకునే బడాబాబులకు శిక్షలు వేయండి అంటూ కొందరు నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు.

## రాష్ట్రాల్లో పెరగనున్న రైల్వే నెట్ వర్క్

భారత్ దార్శనికతకు అనుగుణంగా ఉన్నాయి. ఇవి ఈ ప్రాంతంలో సమగ్ర అభివృద్ధి ద్వారా ప్రజలకు ఉపాధి/స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి వారిని ఆత్మనిర్భర్ దిశగా నడిపిస్తాయి. సమీకృత ప్రణాళిక, భాగస్వామ్య పక్షాల సంప్రదింపుల ద్వారా మల్టీమోడల్ కనెక్టివిటీని, లాజిస్టిక్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై కేంద్రం దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టులు పీఎంగతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఆధారంగా రూపొందించారు. ఈ ప్రాజెక్టులు ప్యాసింజర్ రైళ్లతో పాటు గూడ్స్ రైళ్లకు మరింత కనెక్టివిటీని అందిస్తాయి.మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 19 జిల్లాల మీదుగా సాగే ఈ 3 ప్రాజెక్టులు రైల్వే నెట్‌వర్క్‌ను సుమారు 901 కిలోమీటర్ల మేర పెంచుతాయి. ప్రతిపాదిత మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్ట్ సుమారు 83 లక్షల జనాభా కలిగిన దాదాపు 4,161 గ్రామాలకు కనెక్టివిటీని అందిస్తుంది. ప్రతిపాదిత సామర్థ్యం పెంపుదల ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు రైలు కనెక్టివిటీ పెరుగుతుంది. వాటిలో మహాకాళేశ్వర్, రణతంబోర్ నేషనల్ పార్క్, కియోలాడియో నేషనల్ పార్క్, కూనో నేషనల్ పార్క్, మధుర, బృందావన్, మంత్రాలయం (శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం), శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవస్థానం (కసాపురం), శ్యామ్‌నాథ్ ఆలయం, నైమిశారణ్యం (నీమ్సర్) లాంటివి ఉన్నాయి. బొగ్గు, ఆహార ధాన్యాలు, సిమెంట్ , పిఓఎల్ (పెట్రోలియం, ఆయిల్ అండ్ లూబ్రికెంట్స్), ఇనుము, ఉక్కు, ఎరువులు మొదలైన వస్తువుల రవాణాకు ఈ ప్రతిపాదిత ప్రాజెక్టులు అత్యంత కీలకమైన మార్గాలుగా మారతాయి. ఈ సామర్థ్యం పెంపు పనుల ద్వారా అదనంగా ఏడాదికి 60 మిలియన్ టన్నుల (60 MTPA) సరుకు రవాణా సాధ్యమవుతుంది. పర్యావరణ హితమైన, ఇంధన సామర్థ్యం కలిగిన రవాణా మార్గంగా ఉన్న రైల్వేలు.. దేశ లాజిస్టిక్స్ ఖర్చును తగ్గించడంలో, చమురు దిగుమతులను (37 కోట్ల లీటర్లు) తగ్గించడంలో, CO2 ఉద్గారాలను (185 కోట్ల కిలోలు) తగ్గించడంలో తోడ్పడతాయి. అంటే 7 కోట్ల చెట్లను నాటడంతో సమానమని కేంద్రం పేర్కొంది.

## లక్సెట్టిపేట బాధిత కుటుంబాలకు రూ 50 లక్షల పరిహారం

**జయభేరి, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో గోడ కూలిన ఘటనలో మరణించిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహాం ప్రకటించింది. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై ఉదయం నుండి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి ఇతర బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే.

# మాస్ తో పెట్టుకుంటే మడతే..



దేశ రాజకీయాల్లో చరిత్రలో గత రెండేళ్లు అత్యంత కీలకమైన మార్పులకు సాక్ష్యంగా నిలిచాయి. తమ రాష్ట్రాల్లో ఎదురులేని నాయకులుగా వెలుగొందిన అగ్రనేతలు నేడు తమ సొంత గడ్డపై ఓటమి పాలయ్యారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఢిల్లీ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. 2026లో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు మమతా బెనర్జీ రాజకీయ జీవితంలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయాయి. ముఖ్యమంత్రిగా ఉంటూ ఆమె తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్‌లో పరాజయం పాలయ్యారు. భారతీయ జనతాపార్టీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో ఆమె 15వేల ఓట్లకుపైగా తేడాతో ఓటమి చెందారు. ఈ ఓటమిని మమతాబెనర్జీ జీర్ణించుకోలేకపోయారు. ఇది ప్రజాతీర్పు కాదని, కేవలం లూటీ మాత్రమేనని ఆమె తీవ్ర స్థాయిలో ఆరోపించారు. గత చరిత్రను పరిశీలిస్తే 2021 ఎన్నికల్లో కూడా ఆమె నందిగ్రామ్ నియోజకవర్గంలో ఇదే సువేందు అధికారి చేతిలో ఓడిపోయారు. అయితే అప్పట్లో ఆమె పార్టీ ఘన విజయం సాధించడంతో ఆమె ముఖ్యమంత్రిగా కొసాగారు. కానీ 2026లో పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక, బీజేపీ రాజకీయ వ్యూహాల ఒత్తిడి ఆమె పతనానికి దారి తీశాయి.

దక్షిణ భారత రాజకీయాల్లో బలమైన నేతగా గుర్తింపు పొందిన ఎంకే స్టాలిన్‌కు కూడా 2026 చేదు అనుభవాన్ని మిగిల్చింది. మే 2026లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే అధినేత స్టాలిన్ తన నియోజకవర్గం కొలత్తూరులో ఊహించని విధంగా ఓడిపోయారు. వరుసగా మూడుసార్లు ఇక్కడి నుంచి గెలిచిన ఆయనకు ఈసారి ఓటరు మొహం చాటేశారు. టీవీకే పార్టీ అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో ఆయన 8, 795 ఓట్ల స్వల్ప తేడాతో పరాజయం పాలయ్యారు. ఈ ఓటమి స్టాలిన్‌ను, డీఎంకే శ్రేణులను తీవ్ర ఆత్మరక్షణలోకి నెట్టింది. ఒక ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గంలో ఓడిపోవడం అనేది ఆ రాష్ట్రంలో మారుతున్న రాజకీయ గాలికి నిదర్శనంగా చెబుతున్నారు. గతంలో కూడా ఇలాంటి ఉద్దండులు ఓడిపోయిన చరిత్ర ఉంది.

రాజకీయాల్లో అనతి కాలంలోనే అగ్రస్థానానికి చేరుకున్న అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ ఓటర్లు 2025లో షాక్ ఇచ్చారు. ఫిబ్రవి 2025లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఓటమి చెందారు. బీజేపీ అభ్యర్థి పర్వేష్‌వర్మ చేతిలో ఆయన సుమారు మూడు వేలకుపైగా ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. అధికారంలో ఉన్నవారు ఓడిపోవడం అనే ప్రక్రియ 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి ఊపందుకుంది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. దీని వల్ల అప్పటి ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్ (రాజస్థాన్), భూపేష్ బఘేల్ (ఛత్తీస్‌గఢ్) తమ కుర్చీలను కోల్పోవాల్సి వచ్చింది. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. మమతా బెనర్జీ, స్టాలిన్, కేజ్రీవాల్ వంటి నాయకులు తమ సొంత నియోజకవర్గాల్లో ఓడిపోవడం అనేది కేవలం వ్యక్తిగత ఓటమి కాదు. పశ్చిమ బెంగాల్‌లోనని కీలకమైన నియోజకవర్గం భవానీపూర్‌లో హోరాహోరీ పోరు ముగిసింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి, మమతా బెనర్జీని 15,114 ఓట్ల తేడాతో ఓడించారు.

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గం ఆరంభం నుంచే అందరి దృష్టిని ఆకర్షించింది. యాదృచ్ఛికంగా, భవానీపూర్‌తో పాటు నందిగ్రామ్‌లో కూడా సువేందు అధికారి 9000కుపైగా ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ ఓటమి తృణమూల్‌కు, ముఖ్యంగా మమతాబెనర్జీకి బిగ్ షాక్ అనే చెప్పాలి. ఈసారి బెంగాల్‌లో కాషాయ తుపాను సంచలనాలు నమోదు చేసింది. చాలా జిల్లాల్లో కమలా పువ్వులు వికసించాయి. అనేక చోట్ల తృణమూల్ కాంగ్రెస్‌ను దాదాపుగా తుడిచిపెట్టేశారు. నందిగ్రామ్, భవానీపూర్ అనే రెండు నియోజకవర్గాల్లో సువేందు అధికారి పోటీ చేయంతో అందరి దృష్టి ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలపై పడింది. నందిగ్రామ్‌లో సువేందు సమీప ప్రత్యర్థి తృణమూల్‌కు చెందిన పవిత్ర కర్. ఈ అభ్యర్థి ఎన్నికలకు ముందు బీజేపీని వీడి తృణమూల్‌లో టికెట్ పొందారు. ఈ పవిత్ర కర్ ఒకప్పుడు సువేందు సహాయంతో బీజేపీలో చేరారని వినికిడి.

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో సువేందు ఈ అభ్యర్థిని ఓడించారు. అది ఆయా పార్టీల పతనాన్ని లేదా ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని సూచించే కీలక సంకేతం. ఇక అస్సాంలో అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ ఇచ్చాయి. ముఖ్యంగా ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న, మూడుసార్లు ఎంపీగా గెలిచిన గౌరవ్ గొగోయ్ తన సొంత ఇలాకా జోర్హాట్‌లో ఓటమి పాలవ్వడం అందరినీ విస్మయానికి గురిచేసింది. మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ వారసుడిగా భారీ అంచనాలతో బరిలోకి దిగిన గౌరవ్.. బీజేపీ సీనియర్ నేత హితేంద్రనాథ్ గోస్వామి చేతిలో దాదాపు 22,000 ఓట్ల భారీ తేడాతో పరాజయం పాలయ్యారు. తన లోక్‌సభ పరిధిలోని దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పట్టు కోల్పోవడం గమనార్హం. గౌరవ్ గొగోయ్ ఓటమికి ప్రధాన కారణం ప్రజలకు అందుబాటులో లేకపోవడమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రచార సమయంలో ఆయన క్షేత్రస్థాయిలో తగినంతగా కనిపించలేదని.. కేవలం తన తండ్రి పేరు మీద, అహోం సామాజిక వర్గ సమీకరణాల మీద అతిగా ఆధార పడటం బెడిసి కొట్టిందని చెబుతున్నారు. అలాగే బీజేపీ వ్యూహాత్మకంగా గౌరవ్‌ను 'జాతీయ రాజకీయాలకు మాత్రమే సరిపోయే నేత'గా చిత్రీకరించడంలో సఫలమైందని పేర్కొంటున్నారు. స్థానిక సమస్యల కంటే ఢిల్లీ రాజకీయాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తారన్న ప్రచారం ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేసిందని వివరిస్తున్నారుభారత రాజకీయాల్లో ఇప్పుడు కొత్త నాయకత్వానికి, మార్పుకు సమయ ఆసన్నమైందని ఫలితాలు నిరూపిస్తున్నాయి. రాబోయే కాలంలో ఈ నాయకులు తిరిగి పంజుకుంటారా లేదా కొత్త శక్తులు మరింత బలోపేతం అవుతాయా అనేది వేచి చూడాలి.

## మెట్రో ఫేజ్2కి అనుమతులు ఇవ్వాలి

విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్ 2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించిన విషయాన్ని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ II ప్రాజెక్ట్‌ను భారత ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్ III గా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్ III కి సంబంధించిన డీపీఆర్‌ను కూడా ఇప్పటికే సమర్పించామని తెలిపారు. ఈ సమావేశంలో MoHUA India శాఖ కార్యదర్శి కె. శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, HMRL ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్. రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవుల భర్తీ!

పెంచుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది.రాష్ట్రంలో అత్యంత కీలకమైన తెలంగాణ తెలుగు అకాడమీ ఛైర్మన్‌గా ప్రొ.వెంకటనారాయణ నియమితులయ్యారు. అలాగే, న్యాయపరమైన, పాలనాపరమైన అంశాలతో ముడిపడి ఉన్న తెలంగాణ గ్రామ పంచాయతీ ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా సూదిని రామిరెడ్డిని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ ట్రైబ్యునల్‌లో సభ్యులుగా నగులూరి కృష్ణకుమార్, బూసా వేణుగోపాల్‌లకు అవకాశం దక్కింది.ఇక వివిధ కులాల కార్పొరేషన్లకు ఛైర్మన్లను ప్రకటించారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్ : బస్వరాజ్ శ్రీనివాస్, మున్నూరు కాపు సహకార కార్పొరేషన్ ఛైర్మన్ : బొమ్మ శ్రీరామ్, యాదవ సహకార కార్పొరేషన్ ఛైర్మన్ : ఎం. రఘునాథ్ యాదవ్, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ : బండి రమేష్, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ : జువ్వాది నర్సింగ్‌రావు,పద్మశాలి సహకార కార్పొరేషన్ ఛైర్మన్ : గూడురు శ్రీనివాస్, గీత కార్మికులు, చేనేత, వాషర్‌మెన్ వంటి వృత్తి గిరాకీ ఉన్న సామాజిక వర్గాలకు కూడా ఈ జాబితాలో ప్రాధాన్యత లభించింది.

గీతకార్మికుల కార్పొరేషన్ ఛైర్మన్ : మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్, చేనేత అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ : దూదెం వెంకటరమణ, వాషర్‌మెన్ కోఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ : దాసరిరాజు అజయ్ కుమార్, వడ్డెర సహకార కార్పొరేషన్ ఛైర్మన్ : గుంజ రేణుక నారాయణ, వాల్మీకి బోయ సహకార కార్పొరేషన్ ఛైర్మన్ : గట్టు తిమ్మప్ప వీటితో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ ఛైర్మన్‌గా కొల్లె సరిత, లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఛైర్మన్‌గా చరణ్ కౌశిక్ యాదవ్ బాధ్యతలు చేపట్టనున్నారు. మరికొన్ని విభాగాల్లో.. పెరిక సహకార కార్పొరేషన్ ఛైర్మన్‌గా దొంగారి వెంకటేశ్వర్లు, మేర సహకార కార్పొరేషన్ ఛైర్మన్‌గా సంగా వెంకటరాజం, భట్టరాజ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ ఛైర్మన్‌గా సీహెచ్ బాలరాజు నియమితులయ్యారు.చాలా కాలంగా పదవుల కోసం నిరీక్షిస్తున్న ద్వితీయ శ్రేణి నాయకత్వానికి ఈ నిర్ణయం పెద్ద ఊరటనిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ విజయం కోసం కృషి చేసిన వారికి గుర్తింపు దక్కలేదన్న అసంతృప్తిని తొలగించేందుకు ఈ భర్తీ ప్రక్రియ దోహదపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ మధ్య జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం, పార్టీ విధేయులకే ప్రాధాన్యత ఇస్తూ ఈ జాబితాను సిద్ధం చేశారు.త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా, ఈ నామినేటెడ్ పదవుల భర్తీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మిగిలి ఉన్న మరికొన్ని పదవులను కూడా త్వరలోనే భర్తీ చేస్తామని ప్రభుత్వం సూచనప్రాయంగా తెలిపింది. మొత్తానికి తెలంగాణ రాజకీయాల్లో ఈ నియామకాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.



## నా పర్యటనలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలి

- డిజిపి శ్రీ సివి ఆనంద్ తో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్, మే 6:**

నా పర్యటనల సమయంలో సామాన్య ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలపవద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి డిజిపి సివి ఆనంద్ కు సూచించారు. ముఖ్యమంత్రి బుధవారం నాడు ఢిల్లీ వెళ్తున్న క్రమంలో విమానాశ్రయం సమీపంలో భారీగా వాహనాలు నిలిచిపోవడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని, ముఖ్యమంత్రి వాహనాలు వెళ్లే దారితో పాటు ఎదురుగా వస్తున్న వాహనాలను కూడా ఆపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిజిపి కి ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసు కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ సమస్యపై ముఖ్యమంత్రి పదేపదే మాట్లాడాల్సి రావడం సమస్య తీవ్రతను తెలియజేస్తోందని, క్షేత్రస్థాయి అధికారులు దీనిని గంభీరంగా పరిగణించాలని డిజిపి సివి ఆనంద్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పటిష్టం చేసేందుకు అడిషనల్ డిజిపి ఆధ్వర్యంలో త్వరలోనే 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నామని ప్రస్తుతం విధివిధానాలను రూపొందిస్తున్నామని డిజిపి సివి ఆనంద్ వెల్లడించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా, సింగిల్ లైన్‌గా విభజించి వాహనాలను పంపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి సత్వర నిర్ణయాలు తీసుకోవాలని, సిబ్బందిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలని డిజిపి శ్రీ సివి ఆనంద్ సూచించారు.ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ లేకుండా చూడాలని, ఐఎస్ డబ్ల్యూ, సీఎస్ డబ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతల విభాగం అధికారులు కూడా ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో హైదరాబాద్ సిపి వి.సి. సజ్జనార్, సైబరాబాద్ సిపి ఎం. రమేష్, మల్కాజిగిరి సిపి బి. సుమతి, ఫ్యూచర్ సిటీ జాయింట్ సిపి చందనా దీప్తి, రైల్వేలు మరియు రోడ్డు సేఫ్టీ ఐజిపి రమేష్ నాయుడు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, ఐఎస్డబ్ల్యూ ఓఎస్డి కమలాసన్ రెడ్డి, సిఎంఎస్జి ఎస్పీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు..!

# రైతులు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలి

- శామీర్ పేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా రైతు వారోత్సవాలు.. - ఎమ్మెల్యే మల్లారెడ్డి
- రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించిన అధికారులు

**జయభేరి, శామీర్ పేట్, మే 6:**




సహకార సంఘాల బలోపేతం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఫార్మర్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ అధ్వర్యంలో శామీర్‌పేటలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రైతు సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. రైతు బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, సహకార సంఘాలు రైతుకు అండగా నిలవాలని సూచించారు. సహకార సంఘాల ద్వారా రైతులు తక్కువ వడ్డీ రుణాలు పొందుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కోరారు.

యువత వ్యవసాయ రంగంలోకి రావాలని, సహకార క్లబ్బులు, ఎఫ్‌పీఓల ద్వారా రైతులు మార్కెటింగ్ అవకాశాలు పెంచుకోవాలని సూచించారు. డిజిటల్ పరివర్తనతో వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధరలు లభించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరి ధాన్యం సేకరణ, పంట రుణాలు, నానో ఎరువుల వినియోగం, ఎఫ్‌పీఓ సభ్యత్వ ప్రయోజనాలు, మార్కెటింగ్ విధానాలు, రైతు - శాస్త్రవేత్తల పరస్పర చర్చలపై అవగాహన కల్పించారు. అనంతరం రాష్ట్ర సహకార సంఘాల ప్రత్యేక కమిషనర్ పి.ఎస్. రాహుల్ రాజ్ మాట్లాడుతూ రైతులు సమూహాలుగా ఏర్పడి ఎఫ్‌పీఓల ద్వారా ముందుకు వస్తే రుణాలు, మార్కెటింగ్, నిల్వ సదుపాయాలు సులభంగా లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంచేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంఘాల ప్రత్యేక కమిషనర్ మరియు రిజిస్ట్రార్ పి.ఎస్. రాహుల్ రాజ్, జాయింట్ రిజిస్ట్రార్ సురేఖారాణి, జిల్లా సహకార అధికారి వి. నాగలింగచారి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఆర్. మధుకర్ రెడ్డి, కెనరా బ్యాంక్ లీడ్ బ్యాంక్ మేనేజర్ సి. శివకుమార్, మూడు చింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, రైతు సంఘాల సభ్యులు, వ్యవసాయ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సొంతింటితో నిరు పేదలు సంతోషం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 06 :**

సొంతింటితో నిరు పేదలు సంతోషంగా ఉన్నారని,ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. బుధవారం యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట,కంఠంగూడెం, పెద్దకందుకూరు గ్రామాల్లో ఆయన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. మాసాయిపేట గ్రామానికి చెందిన కళ్లెం బాలమణి, కంఠంగూడెం గ్రామానికి చెందిన కవిత బాలకిషన్, పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన వట్టిపల్లి భరత్, రుద్ర నిర్మల వెంకటేష్ గృహప్రవేశాల్లో పాల్గొని వారికి పట్టుబట్టలు,యాట పొటేలును అందజేశారు. అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఇందిరమ్మ ఇల్లు పథకం తీసుకొచ్చిందని, తద్వారా అనేక మంది నిరాశ్రయులకు శాశ్వత నివాసం కల్పిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలని ప్రభుత్వం కృషి చేస్తోందని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా సమాజంలో ఆర్థిక, సామాజిక స్థిరత్వాన్ని పెంచుతాయని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు,వివిధ పార్టీల నేతలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## కరాటే సమ్మర్ క్యాంప్ ప్రారంభం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు కరాటే సమ్మర్ క్యాంప్ ని DSP శ్రీనివాస రావు , అధ్యక్షుడు NVT సభ్యులతో కలిసి ప్రారంభించినారు. వారు మాట్లాడుతూ ఇలాంటి సమ్మర్ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కరాటే ముఖ్యంగా ఆడపిల్లలకు ఎంతో అవసరమని ఆత్మరక్షణ కోసం అని కరాటే (Karate) అనేది జపాన్‌కు చెందిన ఒక ప్రాచీన, ప్రసిద్ధ యుద్ధ కళ (Martial Art). కరాటే అంటే జపనీస్ భాషలో వట్టి చేతులు అని అర్థం, అంటే ఆయుధాలు లేకుండా కేవలం శరీర భాగాలను ఉపయోగించి చేసే ఆత్మరక్షణ విద్య. ఇది శారీరక దారుఢ్యంతో పాటు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, గౌరవం వంటి మానసిక విలువలను పెంపొందిస్తుంది అని అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్ ,కె పంతుల నాయక్ ,ATO ID ప్రసన్న కుమార్, YS కరుణాకర్, AISf జిల్లా అధ్యక్షులు వల్లమల్ల ఆంజనేయులు, SFI బుడగ వెంకటేష్ ,LIC యాదగిరి, రాము ,జమీర్, శ్రీను కరాటే మాస్టర్ గోపి, మాస్టర్స్ లచ్చిరాం, లక్పతి, సోమ్లా, అభినయ్, విద్యార్థులు, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాంసింగ్ నాయక్ జన్మదిన వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రధాన అనుచరుడు కొర్ర రామ్ సింగ్ నాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పున్న వెంకటేశ్వర్లు , మాజీ ఎంపీపీ జానీ యాదవ్ , మాజీ జెడ్పీటిసి ముఖ్య సలదారులు సురేష్ గౌడ్, ప్రముఖ న్యాయవాది ఉమామహేష్ యాదవ్ , బావోజి బిక్కు నాయక్ మాజీ చందంపేట సర్పంచుల ఫోరం అధ్యక్షులు మల్లారెడ్డి, సైదులు, వెంకటయ్య ,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరీశుడికి నిత్యపూజల వైభవం

- శ్రీవారి నిత్యరాబడి రూ.19.83 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 06 :**

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీనారసింహుడి నిత్యరాబడి..

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా బుధవారం రూ.19,83,198 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,43,050, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,29,600, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.1,86,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.1,68,750, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,91,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.61,496, ప్రసాద విక్రయం ద్వారా రూ.7,45,370, కల్యాణకట్ట ద్వారా రూ.65,000తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**యాదగిరీశుడిని దర్శించుకున్న సునీతా లక్ష్మారెడ్డి, మధు సూదన్ రెడ్డి**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి,మదర్ డైయిరీ చైర్మన్ గుడపాటి మధుసూదన్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు వేదాశీర్వచనం చేయగా, ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామి వారి లడ్డు ప్రసాదం,జ్ఞాపికను అందజేశారు.

## యాదగిరీశుడిని సేవలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి దంపతులకు

- ఘన స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 06 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా బుధవారం యాదగిరిగుట్టకు వచ్చిన ఆయనకు ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి,అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ వేం నరేందర్‌రెడ్డి వేదాశీర్వచనం చేయగా,యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామి వారి లడ్డు ప్రసాదం,జ్ఞాపికను అందజేశారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించి అభివృద్ధి పనులతో పాటు పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని,శాంతి, అభివృద్ధి కోసం స్వామి, అమ్మవార్లను వేడుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్‌లో పర్సన్ ఇంచార్జ్‌ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 06 :**

పీఏసీఎస్‌లో పర్సన్ ఇంచార్జ్‌లను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందని,వెంటనే వెనక్కి తీసుకోవాలని యాదగిరిగుట్ట పిఏసిఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం యాదగిరిగుట్ట మండల స్థాయి రైతుల సమావేశం జరిగింది. అంతకు ముందు యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్‌గా ఇమ్మడి రాంరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు.



అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి,వారి అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రభుత్వం పీఏసీఎస్,రైతు సొసైటీలలో మితిమీరిన జోక్యం చేసుకుంటుందని, అది సరికాదన్నారు. పిఏసీఎస్ పాలకవర్గానికి నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు ప్రయత్నించగా తామంతా కోర్టుకు వెళ్లామని,హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. ఎన్నికలు జరిగే వరకు తమనే బాధ్యతలు చేపట్టాల్సిందిగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, ప్రభుత్వం ఇప్పటికైనా పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరపాలని సూచించారు.

నామినేటెడ్ పద్ధతిలో కాకుండా ఎన్నికలు జరిపితేనే రైతులకు న్యాయం జరుగుతుందని కోరారు. రైతులకు సకాలంలో యూరియా ,విత్తనాలు అందించేందుకు పంట పెట్టుబడి రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులకు ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా వారిని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా పిఏసిఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇమ్మడి రాంరెడ్డిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట కోఆపరేటీవ్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రమాదేవి,సీఈఓ ఆంజనేయులు,నేతలు గోద శ్రీరాములు,కర్రె వెంకటయ్య,కళ్లెం కృష్ణతో పాటు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బండి జంగమ్మ, గ్రామ సర్పంచ్‌లు కవిడె మహేందర్,కొండ ఉపేందర్ రెడ్డి,కృష్ణా ,నేతలు మాటూరి బాలయ్య,కోల వెంకటేష్, ఒగ్గు బిక్షపతి తదితరులు ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## మాజీ ఎంపీపీ గడ్డమీది రవీందర్ గౌడ్ కు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పరామర్శ



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 06 :**

యాదగిరిగుట్ట మాజీ ఎంపీపీ గడ్డమీది రవీందర్ గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బుధవారం విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో ఆయన నివాసంలో గడ్డమీది రవీందర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద వివరాలు,ప్రస్తుత ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీర్ల శంకర్‌తో పాటు పలువురు నేతలు ఉన్నారు.

# పాలమూరులో బిజెపి సమావేశం

**జయభేరి, దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో బుధవారం బిజెపి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ఈనెల 10న తెలంగాణకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వస్తున్న సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, పాలమూరు పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య మాట్లాడారు. ఈ జన ఆగ్రహ బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సభ విషయంలో అన్ని విధాలుగా పార్టీ కార్యకర్తలకు వాహనాలను పార్టీ సమకూరుస్తుందన్నారు. ఈ సమావేశానికి బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మజా రెడ్డి, సుధాకర్ రెడ్డి, పాలమూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, దేవరకద్ర నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.




## రైతుల కుటుంబాలను పరామర్శించిన జీవన్ రెడ్డి

**జయభేరి, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలంలో అర్ధరాత్రి కురిసిన అకాల వర్షాలకు గోడ కూలి మృతి చెందిన రైతుల కుటుంబసభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పరామర్శించారు. అకాల వర్షాల నుండి పంటను కాపాడేందుకు వెళ్లి భారీ ఈదురు గాలులకు కల్లాల సమీపంలో ఉన్న గోడ కూలి నలుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారు. తరువాత లక్సెట్టిపేట పట్టణంలోని ఉత్కూరు చౌరస్తా వద్ద జాతీయ రహదారి పై రాస్తారోకోలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పాల్గొన్నారు. సంబంధిత ఉన్నతాధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబాలకు 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలంటూ డిమాండ్ చేసారు.



## కొండా సురేఖ పై బిజెపి నాయకులు ఆగ్రహం

జయభేరి, తుర్కపల్లి, మే 06 :

తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఇటీవల చేసిన వ్యాఖ్యల పై ఖండిస్తున్నామని బిజెపి మండల అధికార ప్రతినిధి కందుకూరి వేణు అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మంత్రి మాటలు కోట్లాది మంది హిందువుల విశ్వాసాలను కించపరిచేలా ఉన్నాయని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. దేవాదాయ శాఖకు బాధ్యత వహిస్తూ భక్తిని, దైవ నామాన్ని ధనంతో పోల్చడం ఆమె అహంకారానికి నిదర్శనమని, కమలం పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉండి హిందూ ధర్మాన్ని, భక్తుల విశ్వాసాలను అవహేళన చేయడం దారుణం అని రాష్ట్రంలో దూపదీప నైవేద్యాలకు నోచుకోని ఎన్నో ఆలయాలు ఉన్నాయి, వాటికి చిల్లిగవ్వ కేటాయించలేని మీరు దేవుడి నామాన్ని అవమానిస్తారా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన రామనామాన్ని వెక్కిరించడం క్షమించ రాని నేరమని, అధికార గర్వంతోనే ఇటువంటి మాటలు వస్తున్నాయని ఆమె చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు ఆకుల భాస్కర్, తరుణి శ్రీహరి, శ్రీను, వంశీ పాల్గొన్నారు.

## ఈకేవైసీని వెంటనే రద్దు చేయాలి



జయభేరి, తుర్కపల్లి, మే 06 :

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులను కష్టాలు పెడుతూ పనికి దూరం చేస్తున్న ఈ కేవైసీ ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం గ్రామీణ పేదలకు రెండు పూటలా అన్నం పెడుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి జిరాంజీ చట్టాన్ని తేవడం చాలా దారుణమని వెంటనే, ఇట్టి నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎర్రటి ఎండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు 200 నుండి 250 రూపాయలు రావడం లేదని అన్నారు. అనంతరం నూతన మండల కమిటీని 11 మందితో ఎన్నుకున్నారు మండల అధ్యక్షునిగా కొక్కొండ లింగయ్య, కార్యదర్శిగా కోట నాగరాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పోతరాజు జహంగీర్, వెంకటేశం, సిలివేరు పెంటయ్య, గుండెబోయిన వెంకటేశం, కోట వినోద, కోట అలివేలు, లక్ష్మి, మిర్యాల రామచంద్రయ్య, పోచయ్య, పుష్ప, మల్లమ్మ, చింటూ, పవన్ పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ చింటూ ప్రతాప్ రెడ్డి ని పరమార్శించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

- మాజీ కౌన్సిలర్ చింటూ ప్రతాప్ రెడ్డి మాతృ మూర్తి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



జయభేరి, షాద్ నగర్, మే 06 :

షాద్ నగర్ పట్టణ మాజీ కౌన్సిలర్ చింటూ ప్రతాపరెడ్డి మాతృమూర్తి రాములమ్మ వారి నివాసంలో అనారోగ్య సమస్యతో అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. అనంతరం చింటూ ప్రతాప్ రెడ్డి వారి కుటుంబ సభ్యులకు మనోధర్యం కల్పించారు. ఈ పరమార్శ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జూపల్లి కౌశల్యశంకర్, చెట్ల పవని నరసింహులు, శ్రీనివాసులగూడ మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, కాప్రా :

కాప్రా వెస్ట్రన్ బ్లిస్‌లో మెహర్‌బాబా UGD పనులకు సుమారు రూ.46 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ (UGD) పనులను ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి, పరిశుభ్రతకు ఈ UGD ప్రాజెక్ట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రాంతంలో కాలుష్య సమస్యలను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు అన్ని విధాలా అండగా ఉంటాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బైరి నవీన్ గౌడ్ కాలనీ వాసులు, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి సి పిఐ పార్టీ డిమాండ్

- ఇంధన ధరల పెంపుతో సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం
- రచ్చ కిషన్ సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి




జయభేరి, మేడిపల్లి :

బోడుప్పల్ సర్కిల్ 9వ, డివిజన్ వరంగల్ హైవే ఉప్పల్ బస్ డిపో ముందు మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రచ్చ కిషన్ మాట్లాడుతూ.. దేశంలోని సాధారణ ప్రజలపై పెరుగుతున్న జీవన వ్యయ భారం నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ (ఎల్పీజీ) ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐ పార్టీగా మేము గట్టిగా డిమాండ్ చేస్తున్నాము. ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగి, దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడుతోంది. దీనివల్ల సామాన్య ప్రజలు, రైతులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మధ్య తరగతి, దిగువ తరగతి కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి మరింతగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఆర్థిక స్థితిని దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి. అంతేకాకుండా, భవిష్యత్తులో ఇంధన ధరల నియంత్రణ కోసం స్థిరమైన విధానాన్ని అమలు చేయాలి. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నాము. లేనిపక్షంలో, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని సిపిఐ గా మేము డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సహాయ కార్యదర్శిలో సిహెచ్ మాధవి, జి నాగరాజు, డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి దండు రమేష్, బీసీ సంఘం జిల్లా నాయకులు కె ప్రమీల, బాపురాజు, బి కె ఎం యు మండల కార్యదర్శి, అధ్యక్షులు కే మహాలక్ష్మి, భూతం ఐలయ్య, మండల కౌన్సిల్ సభ్యులు రామతార, సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి, సోమరాజు, పి ఆండాలు తదితరులు పాల్గొన్నారు,

# ఇంటిపన్ను వసూలుపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై లేదే

- పరవాడ గ్రామంలో పారిశుధ్య లోపం
- పట్టించుకోని పంచాయతీ ప్రత్యేక అధికారులు



జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా మేజర్ పంచాయితీ పరవాడ గ్రామం రోజురోజుకు విస్తరిస్తూ ఉండడంతో పాటు పారిశుధ్య లోపం కూడా రోజురోజుకి పెరుగుతుంది. పారిశుధ్య లోపం గ్రామంలో అధికారులకు కనిపిస్తున్న దీనిపై శ్రద్ధ చూపకపోవడం సమస్యకు పరిష్కారం ఇవ్వకపోవడతో స్థానిక ప్రజానీకానికి తీవ్ర ఇబ్బందులకు గురవ్వుతున్నారు. పంచాయతీలో ప్రజా నివాసాలకు అవసరం అయ్యిన పారిశుధ్య కార్మికులు,వాహనాలు సరిపడా లేకపోవడం దీనికి ప్రధాన కారణంగా చూపుతున్నారు. సమస్యపై పంచాయతీ ప్రత్యేక అధికారికి ప్రజలు తెలియజేసిన ఎటువంటి ఉపయోగం లేకపోవడంతో తమ గోడువినే నాథుడే లేరని వాపోతున్నారు. శివాలయం రోడ్డులో గృహాలు రోజు రోజుకి పెరుగుతున్న పారిశుద్ధ్యం విషయంలో పంచాయతీ అధికారులు ఎన్ని సార్లు మొరపెట్టుకొన్న సమస్యపై శ్రద్ధ చూపటం లేదని తమ వద్ద నుంచి ఇంటి పన్ను మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తున్నారని అంటున్నారు. శివాలయం రోడ్డులో పదులకొలది గృహ నివాసులు ఉంటున్న వారానికి ఒక్కసారైనా అటువైపుగా పారిశుధ్య కార్మికులు కానీ వాహనం రావడం లేదని, దీనిపై అడిగితే పారిశుధ్య కాంట్రాక్టర్, పంచాయతీ అధికారులు పొంతనలేని సమాధానం ఇస్తుండడంతో ప్రజలు తీవ్ర అసహానానికి గురవ్వుతున్నారు. పంచాయతీలో ప్రతి వీధిలో కూడా పారిశుధ్య వాహనం కార్మికులు తప్పనిసరి వెళ్లాలని నిబంధనలు తెలుపుతున్న పారిశుధ్య వాహనం అటుగా రావడంలేదని ఇప్పటికయినా దీనిపై అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యకు పరిష్కారం అడిగే ఆలోచనలో ఉన్నట్లు తెలుపుతున్నారు.

# నూతన డీజీపీ ఆనంద్ కి శుభాకాంక్షలు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా పదవి బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ఐపిఎస్ ని, హైదరాబాదులోని డిజిపి ఆఫీసులో మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా చర్లపల్లి డివిజన్ లో కోటి 20 లక్షల రూపాయల నిధులతో చేపట్టబోయే స్టోన్ వాటర్ డ్రైనేజ్ పనులకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేసి, వెంటనే పనులు ప్రారంభించేందుకు జైల్ శాఖ డీజీకి సూచించవలసినదిగా ఆయన కోరారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రాంతాల్లో వరద నీటి నిల్వ సమస్యలు తగ్గి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. అలాగే, పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్దిష్ట కాలపట్టికలో పనులు పూర్తి చేయడానికి సంబంధిత మున్సిపల్ శాఖ అధికారుల కు సహకరించవలసినదగా జైళ్ల శాఖ అధికారులను ఆదేశించవలసినది కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

# రైతు సంగ్రామ సదస్సులో మాజీ మేయర్ జక్క



జయభేరి, మేడిపల్లి :

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, జావీద్ ఖాన్, పింగళి జోగిరెడ్డి, ఆకుల మధుకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో ఉన్న స్థిరత్వం ప్రస్తుతం కనిపించడం లేదని విమర్శించారు. రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు, రైతు డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## పురుషోత్తం రెడ్డికి అధ్యక్ష పదవి

- కాంగ్రెస్ పార్టీ కొందుర్గ్ మండల అధ్యక్షుడుగా పురుషోత్తం రెడ్డి నియామకం
- కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకునికి ఉన్నత పదవులు

జయభేరి, షాద్ నగర్, మే 06 :

కాంగ్రెస్ పార్టీ ,ప్రజా ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని కార్యకర్త స్థాయి నుండి సీనియర్ నేతల వరకు ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని మరోసారి రుజువయిందని పురుషోత్తం రెడ్డి అన్నారు. నిరంతరం ప్రజల కోసం ప్రజల సమస్యల కోసం పోరాడి సమస్యలు పరిష్కారం అయ్యే దిశగా ఉన్నత నాయకులకు తెలియజేయడంలోనూ, గ్రామాల్లో మండలాల్లో పర్యటనలు చేసి ప్రజలకు దగ్గరగా ఉండే కాంగ్రెస్ పార్టీ నేతలకు ఉన్నత పదవులు లభించడం ఆనందకరమని పురుషోత్తం రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు, తమకి అండగా ఉన్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన కొందుర్గు మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి.

## బీచ్ లో గల్లంతైన యువకుడు మృతదేహం లభ్యం



జయభేరి, పరవాడ:

పరవాడ మండలం తిక్కవానిపాలెం బీచ్లో సోమవారం సముద్రంలోకి దిగిన యువకుడు గల్లంతు అవ్వడంతో గత రెండు రోజులుగా తిక్కవానిపాలెం బీచ్లో పోలీస్ శాఖ గాలింపు చర్యలు చేపట్టాంది. బుధవారం ఆ యువకుడు గల్లంతైన పరిసర ప్రాంతాల్లోనే మృతదేహాన్ని పోలీస్లు గుర్తించారు. యువకుడు బంధుమిత్రులు సమాచారం అందించిన తరువాత పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరించారు.

## పంటపైనే రైతు మృతి

జయభేరి, కరీంనగర్ :

ప్రభుత్వం వడ్లు కొనకపోవడంతో గుండెపోటుతో గుర్రై మరో రైతు మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాక గ్రామంలో వడ్లను కుప్పలుగా పోస్తూ రైతు ఐలయ్య గుండెపోటుతో గుర్రై మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం మబ్బులు కమ్మడంతో వర్షం పడేలా ఉందని వడ్లను కుప్పపోస్తూ, పంటపైనే కుప్పకూలిపోయాడు. ప్రభుత్వం సకాలంలో పంటను కొనుగోలు చేసుంటే ఐలయ్య బ్రతికేవాడని గ్రామస్థుల ఆవేదన.

# కవితకు తమిళ ఎలక్షన్స్ బూస్ట్

జయభేరి, హైదరాబాద్, మే 6 :



తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని పార్టీ కేవలం రెండేళ్లలోనే అధికారం చేపట్టడం చర్చనీయాంశమైంది. ఈ విజయం తెలంగాణలో సొంత పార్టీ పెట్టిన కల్వకుంట్ల కవితకు పెద్ద ఊరటనిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రక్షణ సేన పేరుతో కవిత పార్టీ పెట్టగా.. కొత్త పార్టీల మనుగడ కష్టమన్న విమర్శలకు విజయ్ విజయం ఒక సమాధానంగా నిలిచిందని అంటున్నారు. 2028 ఎన్నికల నాటికి విజయ్ బాటలో కవిత కూడా తెలంగాణలో చక్రం తిప్పుతారని ఆమె అనుచరులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దళపతి విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కజగం' సృష్టించిన ప్రభంజనం ద్రావిడ రాజకీయాల ముఖచిత్రాన్నే మార్చివేసింది. దశాబ్దాలుగా డీఎంకే, ఏఐఏడీఎంకేలు అధికారాన్ని పంచుకుంటుండగా.. ఆ పార్టీలకు విజయ్ గట్టి షాక్ ఇచ్చారు. తాజా ట్రెండ్స్ ప్రకారం ఒంటరిగా వందకు పైగా స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతూ.. మ్యాజిక్ ఫిగర్ 118కి చేరువలో ఉంది. 2024 ఫిబ్రవరిలో పార్టీ స్థాపించిన కేవలం రెండేళ్ల వ్యవధిలోనే అధికార పీఠాన్ని కైవసం చేసుకోబోతుండటం ప్రస్తుత రాజకీయాల్లోనే ఒక అద్భుతం.అయితే.. ఈ 'విజయ్ విక్టరీ' ప్రభావం ఇప్పుడు తెలంగాణపై ముఖ్యంగా కల్వకుంట్ల కవిత స్థాపించిన కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సమితి' (TRS)పై స్పష్టంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తన తండ్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతో విభేదించిన కవిత తెలంగాణ రక్షణ సేన పేరుతో ఏప్రిల్ 25న కొత్త పార్టీని ప్రకటించారు. బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను వదిలేసిందని.. జాతీయ రాజకీయాల మోజులో రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించిందని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. పాత పేరును తిరిగి తెరపైకి తెస్తూ.. తెలంగాణ అస్థిత్వమే తన ఎజెండా అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె 'పాంచజన్యం' పేరుతో ఒక ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేస్తూ.. రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపే ప్రణాళికను ప్రకటించారు. 'అమ్మ'గా రాష్ట్రంలో పాలన అందిస్తానని చెప్పుకొచ్చారు.అయితే కవిత కొత్త పార్టీపై ప్రత్యర్థులు విమర్శలు గుప్పిస్తున్నారు. 'ఇలాంటి పార్టీలు ఎన్నో వస్తాయి, పోతాయి.. ఇప్పుడున్న రాజకీయ వాతావరణంలో కొత్త పార్టీలకు మనుగడ కష్టం' అని కాంగ్రెస్, బీజేపీ నేతలు కొట్టిపారేస్తున్నారు. దీనికి సమాధానంగా కవిత.. నాటి ఎన్టీఆర్ 9 నెలల్లోనే అధికారం సాధించిన ఉదాహరణను ప్రస్తావించగా.. విమర్శకులు 'అప్పటి కాలం వేరు.. ఇప్పటి కాలం వేరు' అని కౌంటర్ ఇస్తున్నారు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే తమిళనాడులో విజయ్ సాధించిన విజయం కవితకు ఒక గొప్ప 'పొలిటికల్ బూస్ట్'గా మారింది. సోషల్ మీడియాలో ఇన్ఫ్లుయెన్స్ మాత్రమే ఉన్న సెలబ్రిటీలు రాజకీయాల్లో నెగ్గరన్న వాదనను విజయ్ పటాపంచలు చేశారు. కేవలం రెండేళ్లలో తమిళనాడు వంటి రాష్ట్రంలో ఒక కొత్త పార్టీని అధికారంలోకి తీసుకురావటం కవిత నేతృత్వంలోని టీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. విజయ్ సక్సెస్‌ను స్ఫూర్తిగా తీసుకొని కవిత తన కార్యాచరణను మరింత వేగవంతం చేస్తుందని ఆ పార్టీ నేతలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణలో 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా.. ఈలోపు గ్రామ గ్రామాన 'పాంచజన్యం' ప్రణాళికను తీసుకెళ్లి ప్రజల నాడి పట్టుకుంటారని అంటున్నారు. తమిళనాడులో విజయ్ ఎలాగైతే రెండేళ్లలోనే అద్భుతం చేశారో.. తెలంగాణలో కవిత నేతృత్వంలో టీఆర్ఎస్ అదే రీతిలో అధికారం చేపడుతుందని తెలంగాణ రక్షణ సమితి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే తమిళనాడు రాజకీయాలు వేరని.. అక్కడి పరిస్థితులు వేరని.. విజయ్‌కు ఉన్న ఇమేజ్ వేరని.. అలాంటి సినారియో తెలంగాణలో వర్కౌట్ అవుతుందా..? అంటే అవ్వకపోవచ్చునని మరికొందరు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



## ఏపీ జననాయకుడిగా లోకేష్

జయభేరి, విజయవాడ, మే 6 :

తెలుగుదేశం పార్టీలో నారా లోకేష్ ప్రాధాన్యత అందరికీ తెలిసిందే. ఆయన చంద్రబాబు తరువాత స్థానంలో ఉన్నారు. ఈ మధ్యనే ఆయనకు పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కూడా ఇచ్చారు బాబు ఆయనతో ప్రమాణం చేయించారు. ఇక ప్రభుత్వంలో కీలక శాఖలను చూస్తున్న యువ మంత్రిగా ఉన్నారు. అలా పార్టీ ప్రభుత్వంలో లోకేష్ ప్రాధాన్యతమైన ప్రభావవంతమైన పాత్ర నిర్వహిస్తున్నారు. అయితే ఇది మాత్రమే సరిపోదని జనాలకు పార్టీ జనాలకు లోకేష్ మరింతగా కనెక్ట్ కావాల్సిన అవసరం ఉందని పార్టీ భావిస్తోంది అని అంటున్నారు. రాష్ట్రంలో చూస్తే పక్కా మాస్ లీడర్ గా లోకేష్ ని చూపించాలన్న వ్యూహం టీడీపీకి ఉందని అంటున్నారు. లోకేష్ ఇప్పటికే పార్టీ వారిని కలుస్తున్నారు. ప్రభుత్వంలో మంత్రులతో కూడా ఇంటరాక్ట్ అవుతున్నారు. ఎమ్మెల్యేలతో కూడా ఆయన కలసి మెలసి ఉంటున్నారు. క్యాడర్ కి దగ్గరగా ఉండడం చేస్తున్నారు. అయితే ఇది చాలదని అంత కంటే ఎక్కువగా జనంలో ఉండేలా ఒక బృహత్ కార్యక్రమం పార్టీ పెద్దలు డిజైన్ చేస్తున్నారు. అది ఎంతలా అంటే లోకేష్ పేరు జన బాహుళ్యంలో మారు మోగేలా అని అంటున్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో తనలోని నాయకత్వ లక్షణాలను బయటపెట్టారు. దాంతో అందరూ ఆయనలోని కొత్త కోణాన్ని చూశారు అలా ఒకేసారి లోకేష్ పది మెట్లు ఎక్కేశారు. అయితే ఇపుడు పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో లోకేష్ మళ్ళీ జనంతో కనెక్ట్ కావాల్సి ఉందని భావిస్తున్నారు. ఇక నారా లోకేష్ విషయం తీసుకుంటే ఆయన 2023లో చేపట్టిన యువగళం పాదయాత్ర సూపర్ సక్సెస్ అయింది అంతకు ముందు ఆ తరువాత అన్నట్లుగా లోకేష్ పాత్రను మార్చేసింది. ఇక ఆ మీదట టీడీపీ కూటమి విజయం సాధించడం లోకేష్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండడం గడచిన రెండేళ్ళలో తన సత్తాను తన శాఖలల నిరూపించుకోవడం వంటివి జరుగుతున్నాయి. అయితే ఈసారి అలా కాదు, 2029 ఎన్నికల నేపథ్యంలో లోకేష్ ఇంతకు ఇంత రాజకీయంగా రాటు తేలాలీ అంటే జనంలో నిత్యం ఉండేలా పార్టీ రాష్ట్ర స్థాయి పర్యటనలు కార్యక్రమాలు డిజైన్ చేస్తోంది అని అంటున్నారు ఫుల్ ఫోకస్ ఉండేలా : ఏపీలో చంద్రబాబుకు దిగ్గజ నేతగా పేరుంది. ఆయన వారసుడిగా లోకేష్ కి పార్టీలో ఎదురులేదు, యాక్సెప్టెన్స్ ఉంది. అయితే జనసామాన్యంలో కూడా దానికి బలమైన ఆమోదం అవసరం అన్నదే పార్టీ వ్యూహకర్తల భావనగా ఉంది. చంద్రబాబు తరువాత సిసలైన నాయకుడు పార్టీకే కాదు రాష్ట్రానికి రేపటి రాష్ట్ర భవిష్యత్తుకూ లోకేష్ అని ఏపీలోని ఆరు కోట్ల జనాలు అంతా ఆమోదించేలా ఉండాలీ అంటే లోకేష్ మరింతగా జనంలో ఉంటూ తన సత్తాను నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. దాని కోసమే పార్టీ ఒక భారీ యాక్షన్ ప్లాన్ ని రూపొందిస్తోంది అని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలీ అంటే లోకేష్ మీదనే ఫుల్ ఫోకస్ ఉండేలా టీడీపీ పథక రచన చేస్తోంది అని అంటున్నారు. పార్టీ అధినేత వేరు, మంత్రిగా సామర్థ్యం వేరు, ఆరు కోట్ల మంది ఉన్న ఒక రాష్ట్రాన్ని నడిపించే అధినేతగా ఉండడం వేరు. జనాలకు ఆ భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని అంటున్నారు లోకేష్ లో చంద్రబాబుని చూసుకునేలా ఉండాలంటే మరింతగా లోకేష్ జనంలో ఉంటూ కష్టపడాల్సి ఉందని అంటున్నారు. పై స్థాయిలో పార్టీ పరంగా పదవులు అందుకోవడం కాకుండా జనం నుంచే వాటికి తగిన ఆమోద ముద్ర వేయించుకోవాలంటే ప్రజల వద్దకు లోకేష్ వెళ్లడమే ఉత్తమ మార్గం అని పార్టీలో చర్చ సాగుతోంది. దాంతో రానున్న కాలంలో లోకేష్ తో రాష్ట్ర స్థాయిలో పర్యటించేందుకు భారీ కార్యక్రమాలనే డిజైన్ చేయిస్తున్నారు అని అంటున్నారు. అవి ఏ స్థాయిలో ఉంటాయో యువగళాన్ని మించి ఏ తీరున ఉంటాయో అన్నది వేచి చూడాల్సి ఉంది. ఏది ఏమైనా లోకేష్ జన నాయకుడు అనిపించుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. సో ఆ దిశగా భారీ కార్యాచరణ అయితే టీడీపీ సిద్ధం చేసి పెడుతోంది అని అంటున్నారు.

# తెలంగాణలో కమల వికాసం సాధ్యమేనా..?



జయభేరి, హైదరాబాద్, మే 6 :

పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు భారత రాజకీయ యవనికపై కొత్త చర్చకు తెరలేపాయి. ఆ రాష్ట్రంలో ఒక సామాన్య మహిళ సాధించిన విజయం సృష్టించిన ప్రకంపనలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తున్నాయి. ఒక యుద్ధం ముగియగానే మరో యుద్ధానికి సన్నద్ధమవ్వడం రాజకీయ వ్యూహకర్తల నైజం. ఈ క్రమంలోనే అందరి చూపు ఇప్పుడు దక్షిణ భారతం వైపు, ముఖ్యంగా భాగ్యనగర వేదికగా సాగుతున్న పరిణామాల వైపు మళ్లింది. అగ్రరాజకీయ పీఠంపై కన్నేసిన ఒక జాతీయ పార్టీ, తన తదుపరి లక్ష్యాన్ని అత్యంత స్పష్టంగా ప్రకటించడంతో తెలంగాణ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అధికారం చేపట్టిన పార్టీలు ఒకవైపు, కోల్పోయిన వైభవాన్ని వెతుక్కునే శక్తులు మరోవైపు.. వెరసి తెలంగాణ గడ్డ ఇప్పుడు రాజకీయ సమీకరణాలకు అడ్డాగా మారింది. బీజేపీ పశ్చిమ బెంగాల్ విజయ ఉత్సాహంతో ఉన్న బీజేపీ, ఇప్పుడు తన నెక్స్ట్ టార్గెట్ ను ఫిక్స్ చేస్తూ ఒక ట్వీట్ చేసింది. తదుపరి లక్ష్యం తెలంగాణే అని అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ కావడమే కాకుండా, రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. బెంగాల్ తరహా వ్యూహాలను ఇక్కడ కూడా అమలు చేయాలని, ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర నాయకత్వానికి అగ్రనాయకత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దక్షిణాదిలో కర్ణాటక తర్వాత పటిష్టమైన పట్టు సాధించేందుకు తెలంగాణను సరైన వేదికగా కమలం పార్టీ భావిస్తోంది.. తెలంగాణలో బీజేపీకి కేడర్ పరంగా ఎంతో బలం ఉంది.

గత రెండు అసెంబ్లీకి జరిగిన పోలింగ్ ను పరిశీలిస్తే ఓట్ షేరింగ్ శాతం పెరుగుతూ వస్తోంది. అయినప్పటికీ, నాయకత్వ స్థాయిలో కొన్ని లోపాలు ఉన్నాయని పార్టీ అంతర్గత విశ్లేషణలో తేలింది. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు పోరాడటానికి సిద్ధంగా ఉన్నా, నడిపించే విషయంలో అగ్ర నాయకత్వం ఆశించిన స్థాయిలో దూకుడు ప్రదర్శించడం లేదని భావిస్తున్నారు. ముఖ్యంగా నాయకుల మధ్య ఐక్యత, సమన్వయ లోపం వంటివి పార్టీ ఎదుగుదలకు అడ్డంకిగా మారాయి. పార్టీలోని లోపాలపై కార్యకర్తలు బహిరంగంగానే అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర అగ్ర నాయకత్వంలో ఐక్యత పెరగాలని, అప్పుడే అధికార పార్టీలను ఢీకొనడం సాధ్యమవుతుందని కేడర్ గట్టిగా నమ్ముతోంది. కాంగ్రెస్ బలం తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు బీజేపీకి సవాల్‌గా మారాయి.

ఇటీవల జరిగిన జగిత్యాల సభ, బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కేసీఆర్ చేసిన ప్రసంగం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఊపు తీసుకొచ్చింది. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న అనుభవం, క్షేత్ర స్థాయిలో పట్టు బీఆర్ఎస్‌కు బలం పెంచుతున్నాయి. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం వల్ల సహజంగానే ఆ పార్టీకి పాలనాపరమైన అనుకూలత ఉంది. ఈ రెండు బలమైన శక్తులను ఒకేసారి ఎదుర్కోవాలంటే కేవలం మాటలతో సరిపోదని, వ్యూహాత్మకమైన అడుగులు వేయాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కార్యకర్తల ఆకాంక్ష.. రాష్ట్ర నాయకత్వ పరిస్థితి అలా ఉండగా.. సాధారణ కార్యకర్తలు పార్టీ నుంచి తీవ్రమైన పోరాటాన్ని కోరుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీలు దూకుడుగా వెళ్తున్న తరుణంలో, బీజేపీ కూడా అంతే వేగంగా ప్రజల్లోకి వెళ్లాలని ఆశిస్తున్నారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు, ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం వంటి కార్యక్రమాల ద్వారానే ఉనికిని చాటుకోవచ్చని భావిస్తున్నారు. బెంగాల్‌లో సామాన్యుల నుంచి నాయకులను తయారు చేసినట్లే, ఇక్కడ కూడా స్థానిక సమస్యలపై స్పందించే నాయకత్వాన్ని ప్రోత్సహించాలని డిమాండ్ వినిపిస్తోంది. రాబోయే రోజుల్లో కమలనాథుల వ్యూహం? తెలంగాణను గెలుచుకోవాలనే లక్ష్యం గొప్పదే అయినా, ఎంత వరకు సాధ్యమవుతుందనేది వారి వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది. ఇతర పార్టీల నుంచి బలమైన నాయకులను ఆహ్వానించడం, క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలను మరింత బలోపేతం చేయడం వంటి పద్ధతులతో పాటు, తెలంగాణ సెంటిమెంట్‌ను ఎలా డీల్ చేస్తారనేది ఆసక్తికరం. ఏది ఏమైనా, 'టార్గెట్ తెలంగాణ' అనే నినాదంతో బీజేపీ యుద్ధం ప్రకటించింది. మరి త్రిముఖ పోరులో కమలం ఏ మేరకు ప్రభావం చూపుతుందో కాలమే నిర్ణయించాలి.



## టోల్ గేట్ ప్రారంభించిన మంత్రి సవిత

జయభేరి, పెనుకొండ :

పెనుకొండ అటవీ శాఖ ఆధ్వర్యంలో కొండపైకి వెళ్లే రహదారిపై నూతన టోల్ గేట్ను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ టోల్ గేట్ ద్వారా పర్యాటకుల రాకపోకలు సులభతరం కావడంతో పాటు, ప్రాంతీయ వనరుల సంరక్షణకు కూడా తోడ్పడుతుందని తెలిపారు. పెనుకొండను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ దిశగా పెనుకొండ కొండపై సమగ్ర పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సహజ సౌందర్యం, చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ ప్రాంతాన్ని పర్యాటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పర్యాటక శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ లో మంత్రి పొన్నం పర్యటన



జయభేరి, హుస్నాబాద్ :

హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పర్యటించారు. కోహెడ మండలం బస్వాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడుతున్న సమస్యలను రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే జిల్లా కలెక్టర్ హైమావతి తో ఫోన్ లో మాట్లాడి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రైతులకు ధాన్యం కొనుగోలు లో బారదన్, టార్పాలిన్ సమస్య రాకుండా చూసుకోవాలని , లారీలో ఎప్పటికప్పుడు వెంట వెంటనే లోడ్ పంపించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## స్టాలిన్ తో రజనీకాంత్ భేటీ



జయభేరి, చెన్నై, మే 6 :

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. డీఎంకే ఓటమి నేపథ్యంలో ఆ పార్టీ అధినేత ఎంకే స్టాలిన్‌తో సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇవాళ చెన్నైలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుపై తీవ్రమైన రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్న తరుణంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల్లో డీఎంకే ఓటమి పాలైన నేపథ్యంలో స్టాలిన్‌కు సంఘీభావం తెలిపేందుకే రజనీకాంత్ ఆయన్ను కలిశారని సమాచారం. ఈ కష్టకాలంలో తాను ఆయనకు అండగా ఉంటానని రజనీ భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. కొంతసేపు జరిగిన ఈ భేటీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. డీఎంకే కూటమిలోని వీసీకే, వామపక్షాల నేతలు కూడా పార్టీ ప్రధాన కార్యాలయం 'అన్నా అరివాలయం'లో స్టాలిన్‌ను కలిసి మద్దతు ప్రకటించారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో 234 స్థానాలకు గాను స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కేవలం 59 సీట్లకే పరిమితమై అధికారాన్ని కోల్పోయింది. నూతనంగా రాజకీయాల్లోకి వచ్చిన నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) 108 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 సీట్ల మెజారిటీకి చేరువలో ఆగిపోయింది.దీంతో టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వ ఏర్పాటు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఐదు సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ షరతులతో కూడిన మద్దతు ప్రకటించగా, సీపీఐ, సీపీఎం, వీసీకే వంటి పార్టీలతో కూడా టీవీకే సంప్రదింపులు జరుపుతోంది. ఈ రాజకీయ పరిణామాల మధ్య తమిళనాడు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న గవర్నర్ ఆర్.వి. అర్లేకర్ చెన్నైకి చేరుకోవడంతో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ మరింత పెరిగింది. రాబోయే రోజుల్లో రాష్ట్రం సంకీర్ణ రాజకీయాల శకంలోకి అడుగుపెట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# థియేటర్లో ఎరుపు రంగు సెగలు..



కియారా తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో ఈ సరికొత్త ఫొటోలను షేర్ చేసింది. ఈ ఫొటోషూట్‌లో ఆమె ధరించిన ఎరుపు రంగు గౌను చాలా ప్రత్యేకంగా నిలిచింది. ఇది రెండు వేర్వేరు ఫ్యాషన్ శైలుల కలయికగా రూపొందింది. పైభాగం పూర్తిగా బాడీసూట్ లేదా యాక్టివ్‌వేర్ తరహాలో శరీరాన్ని హత్తుకునేలా ఉంది. దీనికి ఫుల్ స్లీవ్స్ మరియు హై టర్టిల్ నెక్ ఉండటం వల్ల మరింత ఆకర్షణీయంగా మారింది. ఇక కింది భాగంలో థైహై స్లిట్ (తొడల వరకు చీలిక) ఉన్న పొడవైన స్కర్ట్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. నడుము భాగం నుండి వచ్చిన ప్లీట్స్ ఈ డ్రెస్సుకు ఒక ప్రత్యేకమైన నిర్మాణాన్ని అందించాయి. ఈ సరికొత్త అవంత్‌గార్డ్ డిజైన్ ఆమెను ఒక అందాల దేవతలా మార్చేసింది. ఈ ఫొటోలు చూసిన అభిమానులు ఆమె అందంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. “నీ ముఖంలో ఉన్న కాంతి అద్భుతం.. ఫ్రేమ్ మొత్తం నీ వల్లే వెలిగిపోతోంది” అని ఒక అభిమాని కామెంట్ చేయగా.. మరికొందరు ఆమె ఒత్తైన జుట్టు వెనుక ఉన్న రహస్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి ఆమె మేకోవర్ మరియు లుక్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ సరికొత్త లుక్ ఆమె నటిస్తున్న తదుపరి భారీ చిత్రం ‘టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్’ చిత్రానికి సంబంధించిన వైబ్‌ను ప్రతిబింబిస్తోంది. ఈ సినిమాలో కన్నడ స్టార్ హీరో యష్ సరసన కియారా నటిస్తోంది. ఈ పాన్ ఇండియా చిత్రంలో నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత వంటి ప్రముఖ నటీమణులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# సుకుమార్‌కు కథ చెప్పడం రాదు..

తెలుగు సినీ పరిశ్రమలో హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటుడు జగపతిబాబు మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆయన కీలక పాత్రలో నటించిన గోదారి గట్టుపైన చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జరిగిన మూవీ ప్రమోషన్స్‌లో దర్శకుడు సుకుమార్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఫిలిం నగర్‌లో చర్చనీయాంశంగా మారాయి. మే 8న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న జగపతిబాబు.. సుకుమార్ కథ చెప్పే స్టైల్ గురించి సరదాగా ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సుకుమార్‌కు అసలు కథ చెప్పడం రాదు.. ఈ విషయం అతడే ఒప్పుకుంటాడు అంటూ నవ్వులు పూయించారు. నాన్నకు ప్రేమతో సినిమా సమయంలో సుకుమార్ తనకు కథ చెప్పడానికి ప్రయత్నించాడని, కానీ చివరకు విసిగి “సార్.. ఇవన్నీ కాదు, మీరు చేసేయండి” అన్నాడని జగపతిబాబు గుర్తుచేసుకున్నారు. దర్శకుడిపై నమ్మకంతో తాను కూడా వెంటనే ఓకే చెప్పేశానని తెలిపారు. అలాగే రంగస్థలం కథ చెప్పిన సందర్భాన్ని కూడా ఆయన సరదాగా వివరించారు. ఆ సినిమా కథ చెప్పడానికి ముందు సుకుమార్ గంటన్నర యోగా చేసి వచ్చాడు. వచ్చాక కూడా ‘సార్.. ప్రెసిడెంట్ సార్.. చొక్కా ఉండదు సార్.. చుట్ట ఉంటుంది సార్.. బావుంటుంది సార్’ అన్నాడు. నేను వెంటనే కథ ఓకే.. డేట్స్ ఎప్పుడు చెప్పు అన్నాను అంటూ చెప్పుకొచ్చారు. జగపతిబాబు వ్యాఖ్యలతో అక్కడున్నవారంతా నవ్వుల్లో మునిగిపోయారు. దర్శకుడిపై ఉన్న నమ్మకంతోనే తాను కథల వివరాలు అడగకుండా సినిమాలు ఒప్పుకుంటానని ఆయన మాటల్లో స్పష్టమైంది. ప్రముఖ నిర్మాత వి.బి. రాజేంద్ర ప్రసాద్ కుమారుడిగా సినీ రంగ ప్రవేశం చేసిన జగపతిబాబు.. సింహస్వప్నం సినిమాతో హీరోగా పరిచయమయ్యారు. అనంతరం గాయం, శుభలగ్నం, మావిచిగురు వంటి చిత్రాలతో ఫ్యామిలీ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తర్వాత అంతఃపురం వంటి వైవిధ్యమైన సినిమాల్లో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. కెరీర్ ఒక దశలో మందగించిన సమయంలో లెజెండ్ సినిమాలో విలన్‌గా కనిపించి సెకండ్ ఇన్నింగ్స్‌కు ఘనమైన శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత శ్రీమంతుడు, అరవింద సమేత వీర రాఘవ, సలార్ వంటి భారీ చిత్రాల్లో తన నటనతో దక్షిణాదిలో మోస్ట్ వాంటెడ్ నటుడిగా మారిపోయారు.

# తుది దశలో ‘ఆదర్శ కుటుంబం’



వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘ఆదర్శ కుటుంబం’. ‘హౌస్ నం 47’ ఉపశీర్షిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. వినోదాత్మక అంశాల మేళవింపుతో క్రైమ్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకున్నట్లు తెలిసింది. ఇటీవలే క్లైమాక్స్‌లోని పోరాట ఘట్టాలను చిత్రీకరించారని, ఇందులో చిత్ర ప్రధాన తారాగణం పాల్గొన్నదని తెలిసింది. ఇంకా కొంత టాకీపార్ట్ మాత్రమే మిగిలి ఉందని, త్వరలో షూటింగ్ మొత్తం పూర్తవుతుందని సమాచారం. ఈ సినిమాలో నారా రోహిత్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. దర్శకుడు త్రివిక్రమ్ తనదైన శైలి హాస్యం, కుటుంబ భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిసింది.



# గ్రామీణ యువతి పాత్రలో..

తమిళ అగ్ర హీరో శివకార్తికేయన్ నటిస్తున్న తాజా చిత్రం ‘సెయాన్’. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయికగా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. బుధవారం ఆమె జన్మదినం సందర్భంగా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె సంప్రదాయ వస్త్రధారణలో డివోషనల్ టచ్‌తో కనిపిస్తున్నది. మురుగన్‌స్వామిని (కార్తికేయుడు) స్ఫురించేలా ఆమె కూర్చున్న విధానం ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఈ సినిమాలో ఆమె ఆత్మవిశ్వాసం మూర్తీభవించిన గ్రామీణ యువతి పాత్రలో కనిపిస్తుందని, ఆమె క్యారెక్టర్ భిన్న పార్శ్వాల్లో సాగుతుందని మేకర్స్ తెలిపారు. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతాన్నందిస్తున్నారు.

# మళ్లీ బాలయ్యతో జతకట్టబోతున్న విద్యాబాలన్..



నందమూరి బాలకృష్ణ మరియు స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ NBK 112 గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో ఒక కీలకమైన మరియు పవర్‌ఫుల్ పాత్ర కోసం బాలీవుడ్ నటి విద్యాబాలన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. గతంలో ‘ఎన్టీఆర్ బయోపిక్’ (కథానాయకుడు, మహానాయకుడు) చిత్రాలలో బసవతారకం పాత్రలో బాలయ్య సరసన మెరిసిన విద్యాబాలన్, దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత మళ్లీ ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం విశేషం. ఈ సినిమాలో మాఫియా నేపథ్యంలో సాగే ఒక హైవోల్టేజ్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందని, అందులో బాలయ్య ‘ఊరమాస్’ అవతారంలో కనిపిస్తారని సమాచారం. ఆ ఎపిసోడ్‌లో ఆయనకు జోడీగా విద్యాబాలన్ పాత్ర అత్యంత కీలకంగా ఉంటుందని టాక్. యువసుధ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తుండగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్ పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఆగస్టులో షూటింగ్ ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**